# రామసుబ్బు లీలలు
# రంగప్రసాద మర్దనం

సివిల్ ఎంజినీరింగ్ పాసై రామసుబ్బు ఉద్యోగాన్వేషణలో ఆఖరికి హైదరాబాదు చేరుకోడం. అక్కడ కూడా కృతకృత్యుడు కాలేక, తిరిగి ఇంటికి చేరుకోడానికి డబ్బులేక. హిమాయత్ నగర్‌లో తన పుట్‌బాల్ మిత్రుడైన యూసఫ్‌ఖాన్ బ్రహ్మచారి లాడ్జిలో చేరడం, తదనంతరం

జీవితాన్నే ఒక ఆటగా పరిగ్రహిస్తే. ప్రధాన జీవిత సమస్య అయిన ధనార్జన అతి సులభంగా పరిష్కారమైపోతుందన్న జ్ఞానోదయం టాంక్ బండ్ మీద ఆతనికి కలగడం. ఆపైని బీరు సీసాల పోటీలో లక్షాధికారి రామయ్య చౌదరిగారి పుత్రరత్నాన్ని ఓడించి అయిదు వందలు నెగ్గడం. ఆ తరువాత వేంకయోపాఖ్యానం. కామినీ రక్షణం. సభాపతి పరాభవం వంటి అనేక లీలల ద్వారా పరిమితమైన కీర్తి ప్రతిష్ఠలు సంపాదించడం. ఇతిహాస రూపంలో ఆంధ్రదేశమంతటా ప్రతి ఇంటా ప్రచారం కావలిసిందే. అయితే హైదరాబాదు సికింద్రాబాదు నగరాలలోనైనా వాటికి తగినంత వ్యాప్తి రాకపో డానికి కారణాలు రెండు. ఒకటి ఆతనిచేత వంచింతులైన ధనమేధా సంప న్నులు తమ పరాజయాన్ని బాహాటంగా చాటడానికి సుముఖులుగా లేకపోవడం. రెండు. కొంత సహజమైన కీర్తి విముఖత్వంవల్ల. కొంత భవిష్యత్తుకు అడ్డు తగులుతుందన్న సంకోచం చేత రామసుబ్బే తన లీలలను సాధ్యమైనంత రహస్యంగా ఉంచడం.

ఉద్యోగాన్వేషణ రోజుల్లో, రామసుబ్బుని అనుక్షణం రెండు మూడు ప్రశ్నలు ఎదుర్కొనేవి. "నీ ఇంటి పేరు" దీనికి సమాధానం అంత స్పష్టంగా లేకపోతే ఉద్యోగదాత వివరణకోసం. "నీ కులం" అని యథాలా పంగా అడిగినట్టో అడిగేవాడు. ఈ ప్రశ్నకి "ఏమిట్లు మీరు?" అన్న రూపాం తరంకూడా కొందరు అధికారులనోట్లోంచి వెలువడేది మొదట్లో "నాకులంచెప్ప వలసిన అగత్యంలేదు. ప్రభుత్వం కులతత్వాలు రూపుమాపాలని పట్టుదలతో కృషి చేస్తుంటే. మీరు నా కులం అడగడంలో నబబు ఏమిటి?" అని కాస్త కటువుగానే రామసుబ్బు ఎదురు ప్రశ్న వేసేవాడు. అయితే ఇంటర్వ్యూలలో ఉద్యోగ దాత అడిగిన ప్రశ్నలకి ఆశ్రితుడు సమాధానం చెప్పాలి గాని, ఎదురుప్రశ్న వెయ్యకూడదు. అంచేత రామసుబ్బుకి ఉద్యోగం రాలేదు. ఆ ప్రశ్నలకి సవ్యంగా సమాధానం చెప్పినా తనకి ఎలాగా ఉద్యోగం రాదని

ఆ తరువాత అతనికి అర్థమైంది. అధమం అయిదేళ్ళ ఇంజనీరింగ్‌కి ఖర్చు పెట్టినంతైనా దొరకదని అతనికి రుజువైపోయిన తరవాత ఉద్యోగాన్వేషణకు స్వస్తి చెప్పి రామసుబ్బు లీలలోపడ్డాడు.

రంగ ప్రసాదమర్దనం అందులో మూడవ లీల. అయితే ఈ లీలలో రంగప్రసాద్‌గారి శరీరానికికాదు మర్దనం జరుగుతా. మనస్సుకి. అభిమానానికి గర్వానికి. రామసుబ్బు తన లీలలలో చట్టానికి దొరికి పోయేటంత అవివేకంగా ఎన్నడూ ప్రవర్తించలేదు—అతనుకొట్టినవన్నీ. పోలీసు దెబ్బల్లాగ లోపలే తగులుతాయి. మెడికల్ సర్టిఫికేట్లకీ. క్రిమినల్ కేసులకీ దొరకవు.

పెర్మిస్‌లోంచి ఒక రాత్రి రామసుబ్బు బయటికి వచ్చి. స్కూటర్ ఎక్కబోతుంటే. పెద్ద ఓడలాంటి కారు మెత్తగా మెరుపులా తాను రోడ్డుమీద జారిపోయింది. వెనకాల ఎక్కుతూ "యూసఫ్‌ఖాన్" అన్నాడు.

"భయ్యా! రంగ్‌పర్‌షాద్."

"సంతోషం."

"సంతోషం? బడా బద్మాష్ బిలీకి ఖచ్చం పెట్టదు."

"ఏం చేస్తాం? కొందరికి పిల్లులంటే అయిష్టం"

"వాడ్కి మనుష్యలంటే అయిష్టం. కరోడ్‌పతి భయ్యా. ఒక్క పైసా చందా ఇచ్చి ఎర్గదు. మినిష్టర్స్ కూడా ఏక్ రుపియా వసూల్ చెయ్య లేకపోయినార్"

"యూసఫ్! పాపం అతన్ని మనమే మంచి దార్లో పెట్టాలి"

"భయ్యా! నై చలేగా. లాభమ్ లేద్"

"ఎందుకు లేదు? లక్షలకి లక్షలు లాభాలు ఆర్జిస్తుంటాడు. దొంగ అక్కౌంట్సురాసి. పన్నులుఎగ్గొడుతుంటాడు. బ్యాంకులోనూ ఇనప్పెట్టిలోనూ డబ్బు మూలుగుతుంది. కొంతైనా మనం ఖాళీ చేసి పెట్టకపోతే ఆ డబ్బు బరువుకి కుంగిపోతాడు మనిషి. అన్నట్టు అతని వ్యాపారం ఏమిటి?

"కంట్రాక్టర్. బిల్డింగ్స్. రోడ్స్. బ్రిడ్జెస్".

"సివిల్ ఎంజినీర్ రామసుబ్బుకి పని కల్పించకుండా, ఇన్ని కట్టడాలు కట్టించినవాడు, మనకి నష్టపరిహారంగా పాతికవేలన్నా ఇవ్వకపోతే ఎలా?

"పాతిక వేలా? పాతిక పైసా ఇవ్వడు."

ఆ తరవాత రామసుబ్బు ఏమన్నాడో స్కూటర్ చప్పుడులో యూసఫ్‌కి వినపడలేదు. అతడు "క్యా" అన్నాడుగాని, రామసుబ్బు వివరించలేదు.

బ్రహ్మచారి లాడ్జిలో గుడ్డలు మార్చకుండానే రామసుబ్బు నలిగిపోయిన పక్క మీద పడుకున్నాడు. యూసఫ్ టీ కాచడానికి గాస్‌స్టవ్ అంటించాడు. రామసుబ్బు తన ఆర్థిక సూత్రాలు వివరించాడు, సిగరెట్టుపొగ వొదులుతూ,

"యూసఫ్! ప్రతి రాత్రి టీ కాస్తావు. ఇతర పానీయాలు ఎన్ని తాగినా, ఎంత తిండి తిన్నా, రాత్రి పడుకోబోయే ముందు టీ తాగితే కిందటి నెలకన్నా ఈ నెల నీ టీ ప్రతి కప్పు అధమం రెండు పైసలైనా పెరిగింది నువ్వు బీడీలు కాలుస్తావు, నేను సిగరెట్లు. రెంటి ధరా ఈ సంవత్సరం మన స్కూటర్ పెట్రోలు ధర పెరిగింది, బస్ టిక్కట్టు వెల పెరిగింది. రైల్వే రేటు పెరిగింది. పేదల జీవితం వెల పెరిగింది. కారణం ఏమిటి?"

యూసఫ్ టీ కలుపుతూ కళ్ళెత్తి చూశాడు.

"కారణం రంగప్రసాద్"

యూసఫ్ నవ్వాడు.

"నిజం తమ్ముడూ? వాడు పెద్దపెద్ద కంట్రాక్టు చేస్తున్నాడు. కూలీలు మొదలు కొన్ని పై ఎంజినీర్ దాకా అందరూ చెమటోడ్చి వాడికోసం పని చేస్తున్నారు. వాడేం జేస్తున్నాడు? చేసిన లాభం దాచేసి నష్టం చూపిస్తున్నాడు. ప్రభుత్వానికి పన్ను ఎగ్గొడుతున్నాడు. కంట్రాక్టు సొమ్ము ప్రభుత్వం వద్ద నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నాడు. ప్రభుత్వానికి డబ్బు కావాలి. వాడి వద్ద నుంచి ఊడిపడదు. అంచేత ప్రభుత్వం ఏం చేస్తోంది? నీ "టీ" మీద నీ బీడీ మీద, నా సిగరెట్టు మీద, నా డ్రింకు మీద, మన స్కూటర్

పెట్రోల్ మీద పన్ను వేస్తోంది. మనం అదనంగా ఇస్తున్న పన్నంతా ఏమైం దన్న మాట? రంగప్రసాద్ దగ్గర చేరిందన్న మాట. అంచేత వాడు మనకి బాకీ. మనం వసూలు చేస్తాం. మనం పాతికవేలదాక కట్టామా అంటే లేదనుకో. అయినా మనలాటివాళ్ళ సొమ్ము ఎన్ని పాతికవేలో వాడి దగ్గర మూలుగుతోంది. ఒక్క పాతికవేలు మనం వసూలు చేస్తే కొంత కాకపోతే కొంతైనా లోకానికి న్యాయం చేసిన వాళ్ళమవుతాము"

యూసఫ్ కళ్ళు ఆశగా మెరిశాయి. రామసుబ్బు గట్టిగా తలుచుకుంటే ఏదన్నా సరే సాధించగలడని అతని నమ్మకం.

రంగ ప్రసాద్ ఇల్లు బంజారాహిల్స్‌లో ఒక ఎత్తయిన కొండ కొమ్ము మీద వుంది. రామసుబ్బు స్కూటర్ స్టాండ్ మీద నిలబెట్టి, విశాల మైన ఆ ఇంటిమెట్లు సొంత మెట్లలాగ యెక్కాడు. ఒక బల్లవద్ద కూర్చున్న రిసెప్షనిస్టుకి తన కార్డు ఇచ్చాడు. కార్డు వంక అతని వంక రెండుసార్లు చూసి, రిసెప్షనిస్టు పని ఏమిటో చెప్పమంది. రంగప్రసాద్‌గారి దర్శనం చేసు కోడం తప్ప తన కింకేమీ పనిలేదన్నాడు రామసుబ్బు. త్వరలో ఆ మహసీయు డికి ఏ పద్మవిభూషణమో రాబోతుంది. అందుకు సహాయం చెయడం తన విధి అనుకుని రామసుబ్బు వచ్చానన్నాడు. రిసెప్షనిస్టుకి ఈ ధోరణి అంతు పట్టలేదు. ఒకక్షణం అనుమానించి లోపలికి వెళ్ళింది. రామసుబ్బు మెత్తని సోఫాలో కూర్చుని బల్ల మీదున్న దినపత్రిక తిరగ వేస్తుండగా రిసెప్షనిస్టు తిరిగివచ్చి, ఒక గదివేపు చూపించింది. రామసుబ్బు ఒక కమ్మని చిరునవ్వు ఆమె మీద పారేసి, తలుపు తెరిచి లోపలికి వెళ్ళాడు. పెద్ద బల్ల వెనక, తిరుగుడు కుర్చీలో వింత చిరునవ్వు పెదవుల మీద బిగించి, రంగప్రసాద్ తల ఊపుతూ యెదురుగా వున్న కుర్చీ చూపించాడు. రామసుబ్బు కూర్చున్నాడు.

"నాతో ఏమిటి పని? పాపికొండల్లో వున్న నిధికోసం పది వేలుకావాలా? జపాన్ బంగారం కోసం పదిహేను కావాలా? అన్నాడు రంగప్రసాద్.

రామసుబ్బు ఒక చిటికసేపు బిత్తరపోయాడు ఒక్క చిటిక సేపే.

"మీ యిష్టం. అందులో మీరు ఏది ఏరుకున్నా సరే. నాకు పాతిక వేలు కావాలి" అన్నాడు తాపీగా. రంగప్రసాద్ కళ్ళెత్తి చూశాడు. రామసుబ్బు సిగరెట్టు కోసం కోటు జేబులో చెయ్యి పెట్టాడు. రంగప్రసాద్ గంధపు చెక్కమీద దంతం పొదిగిన పెట్టె అతని ముందుకు తోస్తూ.

"ఇది రుచిచూడు. ఇంగ్లండ్ నించి నిన్ననే వొచ్చాయి." అన్నాడు.

రామసుబ్బు అందులో సిగరెట్టు తీసుకున్నాడు. అంటించాడు. రంగప్రసాద్ పెట్టె టప్పున మూస్తూ అన్నాడు."

"మిష్టర్! నీ సంగతి నేనంతా వాకబు చేసాను. నీ సంగతి కొంత కొంత నా మిత్రులు వెంకయ్య. సభాపతి ద్వారా విన్నాను. నా మనిషి ఒకడు నీ వెన్నంటి. నీ దిన చర్యంతా నాకు చెపుతుంటాడు నీ మిత్రుడు భాగస్వామి యూసఫ్‌ఖాన్ ఎలా వున్నాడు.

రామసుబ్బుకి ఇప్పుడు సంకోచమంతా పోయింది.

"తమ వద్ద పాతిక వేలకోసం ఆత్రంగా యెదురుచూస్తున్నాడు." అన్నాడు.

"అయితే అతను పాపం ఆ ఆత్రంతోటే చచ్చిపోవాలి. నా వద్ద నించి పాతిక పైసలు కూడా వసూలు చెయ్యలేడు."

"అది వివాదగ్రస్తమైన విషయం. అయినా మీ విశ్వాసాన్ని ప్రశ్నించడానికి రాలేదునేను. ప్రస్తుతం బాంగ్లాదేశ్ కాందిశీకుల సమస్య దేశానికి గడ్డు సమస్యగా పరిణమించింది. ప్రజాధనం కోట్లకు కోట్లు అక్కడ ఖర్చు పెట్టవలసి వస్తోంది"

"ఆ సందర్భంలో ముఖ్యమంత్రిగారు. సెంట్రల్ మినిష్టర్స్‌లో ఒకరు. నా కోసం. తిరిగారు కాని వారికి నేనంద లేదు. ఎవటపడ్డీ లేదని

వారి మనస్సు నొప్పించడం నాకిష్టంలేదు. ఏమైనా వాళ్ళ కాంట్రాక్ట్సు చేస్తూన్నాను గదా. ఏమైనా బాంగ్లాదేశ్ కాందిశీకులకు నా వద్ద నించి దమ్మిడీ ఎత్తు ఉపకారం జరగదు. ఆ సంగతి అధికారులకే అర్థమైంది."

"బాంగ్లాదేశ్ కాందిశీకుల సంగతి ప్రభుత్వం చూస్తోంది. దేశంలో అంతకన్న బాధపడుతున్న ప్రజలు అనేకులున్నారు వారి తరపున తమ వద్ద నుంచి వసూలు చెయ్యడానికి వచ్చాను."

"ఎలా వసూలు చేస్తావు? పిస్టల్ తీసుకొచ్చావా? నన్ను బెదిరించి చెక్కు తీసుకుపోతావా?

"నే నవతలికి పోగానే మీరు బ్యాంకుకి ఫోన్ చేసి. ఆ చెక్కుకి డబ్బు ఇవ్వవద్దని హెచ్చరిస్తారుగా? అదేంలాభం? అదీగాక పిస్టల్ చేత పట్టుకుని వ్యవహారాలు సాగించడం నా పద్ధతికి విరుద్ధం."

"విన్నాను. నీ పద్ధతులు చాలా చట్ట సమ్మతమైనవట."

"అన్నట్టు మీ మిత్రులు చెప్పే వుంటారుగా."

"నా టైమ్ చాలా విలువైనది."

"అవునవును. నిమిషం వెయ్యి ఖరీదు."

"ఏ లెక్కని?"

"నాతో సరిగ్గా పాతిక నిమిషాలు మాట్లాడారు—పాతికవేలకి"

రంగప్రసాద్ నవ్వాడు.

"సరే. అయితే పాతికవేలు ముట్టినట్టేగా? గుడ్‌బై."

రామసుబ్బు లేచాడు. రంగప్రసాద్ చెయ్యి అందించాడు. కరచాలనం పూర్తి కాకుండానే రామసుబ్బు అన్నాడు.

"మిస్టర్ రంగప్రసాద్! ఈ రాత్రి నాతో డిన్నర్ చెయ్యడానికి మీకేమైనా అభ్యంతరం ఉందా?"

"ఎక్కడ?"

"మీ ఇష్టం. రిట్జ్?"

"సరే. ఎన్ని గంటలకి?"

"మీ ఇష్టం. ఎనిమిది?"

"సరే"

ఆ రాత్రి రంగప్రసాద్ కారు దిగగానే రిట్జ్ మానేజర్ అతి మర్యాదగా ఆయన్ని హోటల్‌లోకి తీసుకుపోయాడు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదిలో రామసుబ్బు, యూసఫ్ కూర్చుని వున్నారు. అప్పటికప్పుడే యూసఫ్‌కి డ్రింకు వల్ల గాజు కళ్ళు పడ్డాయి.

"ఆదాబ్" అన్నాడు యూసఫ్. పాతకాలపు మర్యాద ననుసరించి ముందుకి వంగి సలామ్ చెయ్యబోయి, పడిపోయాడు. టేబుల్‌ని అనుకున్నాడు. టేబిల్ పడబోతుంటే రామసుబ్బు పట్టుకున్నాడు.

"తమవంటి గొప్పవారిని కలుసుకోవడంతోటే, నా మిత్రుడికి ఆవేశం' ఆందోళన ఎక్కువయాయి. అంత మనిషి ఉన్నాడుగాని, అంతా గుండెకాయే. దయచెయ్యండి"

మానేజర్ కుర్చీ వెనక్కి లాగాడు, రంగప్రసాద్ కూర్చున్నాడు.

స్కాచ్‌విస్కీ, ఆ తరువాత షాంపేన్, పదిమంది వెయిటర్లు, అంతా రంగప్రసాద్ గమనిస్తూనే వున్నాడు. వ్యాపారంలో ఎందరో తన చేత తాగించి లాభం పొందలని చూశారు. వాళ్ళ తరం కాలేదు. ఈ కుర్రికుంకా?

"నాచేత తాగించి నీ పంతం నెగ్గించుకోవాలని చూస్తున్నావా?

రామసుబ్బుకే మాటలు తడబడ్డం మొదలు పెట్టాయి.

"తాగిన స్థితిలో....ఎవడేంచేసినావాడు దానికి బాధ్యుడుకాడు" అన్నాడు

"నే నెంత తాగినా మాట, మనసు తడబడవు"

"చూస్తున్నాగా? మీరు కొరకరాని కొయ్యలై పోయారు నాకు"

"అయితే ఓటమి ఒప్పుకున్నావన్నమాట"

కంఠంలో—అదే ప్రాణంఎక్కడుంటుంది?... ఎక్కడుంటేఏం? ... ప్రాణం ఉన్నంత వరకు—ఓటమి ఒప్పుకోడం—నా.... తత్వానికి విరుద్ధం ...

"అయితే ఏం చెయ్యదలుచుకున్నావు?"

"మిస్టర్.... ర్రంగప్ ... ప్రసాద్." అన్నాడు రామసుబ్బు.

రంగప్రసాద్ వెటకారంగా అతని వంక చూశాడు.

"మీరు పాతికవేలకి చెక్కు ఇవ్వండి....అది నేను ...మ .. మ్.... మార్చేస్తాను"

"నీ తరం కాదు"

"ఎంత ప....ప....పందెం?"

"నీ దగ్గరేముంది నాతో పందెం వెయ్యడానికి!"

"ఇన్‌సల్ట్" అంటూ పాస్‌బుక్ రంగప్రసాద్ మీద పారేశాడు రామసుబ్బు అందులో పదిహేనువేలుంది.

"పదిహేనువేలు పందెం అందునుగాని, ఓడిపోయాక నువ్వు వీధిని పడాలి.

"మిస్టర్ ర్రంగప్-ప్రసాద్! మీరూ నేనూ వీధుల్లోంచి ...వొచ్చిన వాళ్ళమే తిరిగి అక్కడి ప్-పోవ్డానికి-ఐయామ్ రెడీ మీకు భయమా? పాతిక వేలకి చెక్కు రాయండి. ఆ తరవాత నా చాకచక్యం చూడండి" రంగప్రసాద్ అతనివంక చూశాడు.

"తాగినవాడిని అన్యాయం చెయ్యడం—అన్యాయం" అన్నాడు.

"అది పొరబాటు మీరు డబ్బు పోతుందని భ్ భ్ భయపడుతున్నారు. ఒప్పుకోండి" అన్నాడు రామసుబ్బు.

రంగప్రసాద్‌కి అభిమానం ఒచ్చింది.

"ఫూల్! అయితే ఇప్పుడే చెక్కు రాపిస్తాను. రేపెల్లా మారుస్తావో చూస్తాను మార్చ లేకపోతే నీ పదిహేను వేలూ నా కిస్తావా?"

రామసుబ్బు రెండు రోజుల తరవాత తేదీ వేసి పదిహేను వేలకి చెక్కు రాశాడు.

"ఏమయ్యా లక్షాధికారీ! నలభై వేలకి చెక్కు రాయి చేవుంటే"

"నలభై వేలకా?"

"పాతికవేలు చందా నిరుద్యోగ సంస్థకి. పదిహేను పందెం. ఓడిపో యానని ఒప్పుకుంటే. రాయొద్దు. భయం వేస్తోందా?"

రంగప్రసాద్ అసహ్యం వ్యక్తపరిచే చిరునవ్వుతో నలభై వేలకి చెక్కు రాశాడు. రంగప్రసాద్ రామసుబ్బు చెక్కులు మార్చుకున్నారు.

యూసఫ్‌ఖాన్ ఏడవ స్వర్గంలో గురుర్రి పెడుతున్నాడు.

ఇల్లు చేరడంతోటే రంగప్రసాద్ హైదరాబాద్ స్టేట్ బ్యాంక్ ఏజెంటుకి ఫోన్ చేశాడు.

"ఏజెంటుగారూ! నేను, రంగప్రసాద్ మాట్లాడుతుంటా రేపు ఒక బేరర్ చెక్కు వొస్తుంది. నలభై వేలకి నెం—హెచ్.ఎస్. 7-17220. అది పాస్ చెయ్యొద్దు. కారణం తరవాత చెపుతాను"

తరువాత పదిహేనువేలు సంపాదించిన గర్వంతో సుఖంగా నిద్ర పోయాడు రంగప్రసాద్.

మరునాడు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేస్తుంటే రిసెప్షనిస్టు కుమారి హైద రల్లీ ఒక దినపత్రిక పట్టుకుని వచ్చింది. చాలా ముఖ్యమైన పనుంటే తప్ప కుమారి హైదరల్లీ అలా చొరవజేసి డైనింగ్ రూంలోకి రాదు. రంగప్రసాద్

సగం చిరాకు కుతూహలంతో ఏమిటి విశేషమన్నట్టు ఆమె వంక చూశాడు. ఆమె క్షమాపణ పూర్వకంగా అంది.

"క్షమించండి, ఈ పత్రికలో ...." అంటూనే పత్రిక అతని ముందు పెట్టింది. మొట్టమొదట అతన్ని ఆకర్షించింది అతడు నిన్న రాత్రి రామసుబ్బుకి రాసి ఇచ్చిన చెక్కు ఫోటో, పెద్దదిగా పేజీ మధ్య అచ్చుపడింది. బొమలు ముడివేసి పైన చదివాడు రంగప్రసాద్.

"అటు సూర్యుడు ఇటు పొడిచినా ఇంత ఆశ్చర్యపడనక్కరలేదు. ఏ సంస్థకీ ఏ వ్యక్తికీ ఇంతవరకు నయాపైసా యిచ్చి ఎరుగరు రంగప్రసాదు గారు ఒక్కసారిగా ఇంతటి దాతృత్వం ఆయనలోంచి పుట్టుకొచ్చిందంటే ప్రపంచంలో ఎనిమిదవ వింతగా దీన్ని పరిగ్రహించవచ్చు ఒకటి కాదు రెండుకాదు, ఒక్కసారిగా నలభై వేలరూపాయిలు. "ముఖ్యమంత్రి బాంగ్లా కాందిశీకుల నిధి"కి వీరు విరాళం ఇచ్చారకంటే అది హైదరాబాదేకాదు, యావద్భారత దేశం హర్షించదగ్గ విషయం. సదరు చెక్కు పాఠకులకోసం ఈ క్రింద అచ్చు వేస్తూన్నాం"

పత్రిక పేరు అభ్యుదయ తెలంగాణా।

రంగప్రసాద్‌కి మతిపోయింది. చెక్కు ఇప్పుడు ఆపేస్తే ముఖ్యమంత్రి గట్టిగా తలుచుకుంటే, తనకి నలభై లక్షలు నష్టం రావచ్చు. అసలు విరాళం ఇవ్వక పోవడంవేరు. ఇచ్చిన తరవాత చెక్కు ఆపెయ్యడం వేరు. బ్రేక్‌ఫాస్టు పూర్తి చెయ్యకుండానే ఫోన్ దగ్గరకుపోయి, హైదరాబాద్ స్టేట్ బ్యాంకుకి ఫోన్ చేశాడు రంగప్రసాదు, అవతల ఏజెంటు ఫోన్ఎత్తగానే,

"ఏజంటుగారా? చూడండి, నలభై వేల చెక్కన్నానే, నిన్నరాత్రి పాస్ చెయ్యొద్దని ఫోన్ చేశాను. అది తిప్పేశారా కొంపతవ్వి?"

ఇంకా అది బ్యాంక్‌కి రాలేదని తెలిశాక కాస్త తాపీగా ఊపిరి పీల్చుకున్నాడు రంగప్రసాదు, తరవాత అన్నాడు.

"మరేంలేదు. ఆ చెక్కు పాస్ చెయ్యండి"

రంగప్రసాదు ఆందోళన అంతటితో తీరలేదు. అన్యాయంగా నలభై వేలు పోయాయన్న బాధ ఒకపక్క పీడిస్తుండగా. బ్రేక్‌ఫాస్ట్ పూర్తిచేసి ఇవతలకిరాగనే నలభై ఆరు ప్రజా సంస్థల ప్రతినిధులు చందాల కోసం వొచ్చి కూర్చున్నారని కుమారి హైదరల్లీ కబురు తెచ్చింది.

"చూడు. నేనిప్పుడెవరినీ చూడను—చూడదలుచుకోలేదు....

అలాకాదు—ఆకస్మాత్తుగా పొద్దున్న ప్లేన్‌లో బొంబాయి వెళ్ళిపోయారు. ఎప్పుడొస్తారో తెలియదని చెప్పు"

చందాలకు వచ్చినవాళ్ళు వెళ్ళిపోయినా. రంగప్రసాదు మనసు మనసులో లేదు. ఎవ్వరికీ చెప్పకుండా కారు వెనక తోట పక్కకి తెప్పించుకుని. ఆయన కరీంనగర్ బంగ్లాకి వెళ్ళిపోయారు.

అమ్మ గాడిదకొడుకు! రామసుబ్బు ఎంతఎత్తు వేశాడు! కాని ఒకటే రంగప్రసాద్‌కి సంతృప్తి. ఆ నలభై వేలలో ఒక్క దమ్మిడీ వాడికి దక్కదు. ముఖ్యమంత్రి బాంగ్లా నిధికి పోతుంది.

కరీంనగర్‌లో రాత్రంతా మనసు తేటపడ్డంకోసం ఆసనం సేవించి, రంగప్రసాదు కుతుహలంకొద్దీ మరునాడు అభ్యుదయ తెలంగాణా పత్రిక తెప్పించాడు. అందులో రెండవ పేజీలోపడ్డ సవరణ పిడుగులా అతన్ని దిగ్భ్రాంతుణ్ణి చేసింది.

సవరణ : నిన్నటి మా పత్రికలోపడ్డ ఒకవార్తలో చిన్నపొరబాటుంది. శ్రీ రంగప్రసాదు గారు విరాళం ఇచ్చింది బాంగ్లా కాందిశీకుల నిధికి కాదు. నిరుద్యోగుల నిధికి ఆ సంస్థ తరపున శ్రీ రామసుబ్బు గారు ఆ మొత్తం స్వీకరించారు"

కుర్చీలో వెనక్కి నీరసంగా జేర్లబడి, రంగప్రసాద్ తనలో తను అనుకున్నాడు! "రామసుబ్బు! నాకన్న గట్టివాడివి. సందేహంలేదు"